క్లుప్తంగా

ఐఐటీ ర్యాంకర్‌కు అభినందన

ఖమ్మం మామిళ్లగూడెం: ఐఐటీలో ఆల్ ఇండియా 2472వ ర్యాంకు సాధించిన సామాజిక ఉద్యమ నేత లింగాల రవికుమార్ తనయుడు లింగాల ఆదర్శ్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. శుక్రవారం ఆదర్శ్‌కు స్వీట్ తినిపించి కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌ను తెలంగాణ ఆస్పత్రి న్యూరో సర్జన్ డాక్టర్ మురళి, పీఆర్‌టీ దాసరి శ్రీనివాస్ శుక్రవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ముందుండి మంచి పాలనను అందించాలని కోరారు.

వేతనాల చెల్లింపుపై హర్షం

ఖమ్మం సహకారనగర్: 2024 డీఎస్సీ ఉపాధ్యాయులకు నియామక ఉత్తర్వులు ఇచ్చిన అక్టోబర్ 10, 2024 నుంచి సర్వీస్ లెక్కించి వేతనం చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంపై టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావులు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పలుమార్లు తమ సంఘం తరఫున వినతులు సమర్పించడంపై ప్రభుత్వం స్పందించిందన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాట్లు పరిశీలన

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో శుక్రవారం అదనపు విద్యుత్ స్తంభాల ఏర్పాట్ల పనులను ట్రాన్స్‌కో డీఈ నాగేశ్వరరావు పరిశీలించారు. ప్రజలకు మెరుగైన, నిరంతర విద్యుత్ సరఫరాను అందించేందుకు కొత్తగా 84 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందుకు పాలేరు నియోజకవర్గంలో రూ.9 కోట్ల ప్రత్యేక నిధులతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, లైన్ల పొడిగింపు పనులు చేపట్టినట్లు వివరించారు. ఏడీఈ కోక్యా నాయక్, ఏఈ అశోక్, గ్రామస్తులు పెండ్ర అంజయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం చల్లగుండ్ల కృష్ణమూర్తి జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు పలకలు, నోట్ బుక్స్, కంపాక్స్ బాక్స్‌లు అందించారు. అనంతరం స్థానిక హెల్త్ కమ్యూనిటీ సెంటర్‌కు సీలింగ్ ఫ్యాన్ అందించారు. హెచ్‌ఎం అనంతు నరేంద్ర, దాత చల్లగుండ్ల వెంకటరామయ్య, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయురాలు వై.రమాదేవి పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: దాడిచేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు తగిన చర్యలు తీసుకోవాలని మాదిగహక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్, మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టి గురుమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల కామేపల్లి మండలం పింజరమడుగుగ్రామంలో దళితులపై అగ్రవర్ణాల మూకుమ్మడిదాడి దుర్మార్గపు చర్య మండిపడ్డారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ ఉపకులాల జేఏసీ తెలంగాణ అధ్యక్షుడు గవరవరపు డేవిడ్‌రాజు, దండోరా జిల్లా అధ్యక్షుడు దుప్పెల్లి శ్రీను, ఆర్పీఐ పార్టీ రాష్ట్ర నాయకులు నకిరికంటి సంజీవరావు, పరిశాల వెంకన్న, కొండ వెంకన్న, చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇటికల లత, బాధితులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కుబేర
వినోద	సితారే జమీన్ పర్
ఆదిత్య	8 వసంతాలు
శ్రీనివాస	కుబేర

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	38	బచ్చలికూర	4
వంకాయ	28		20
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	66	చుక్కకూర	3
బీర	40		20
దొండ	18	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	66	గోంగూర	4
గోరుచిక్కుడు	46		20
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	45		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	34		40
క్యారెట్	48	పుదీన	1
క్యాప్సికం	70		20
బీట్‌రూట్	40	-ఖమ్మం వ్యవసాయం	

ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దుతాం..

- ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి
- కేఎంసీలో హెల్త్ క్యాంపు ప్రారంభోత్సవంలో మేయర్ నీరజ


వైద్య శిబిరంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న మేయర్, పక్కన డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో పారిశుద్ధ్యాన్ని పకడ్బందీగా నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాలను సంరక్షిస్తున్నామని, ఆరోగ్యవంతమైన ఖమ్మంను రూపొందించడమే తమ లక్ష్యమని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. శుక్రవారం ఖమ్మం నగర పాలక సంస్థలో వందరోజుల కార్యాచరణలో భాగంగా మెప్మా ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించాక మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు అనారోగ్యాలకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్మికులు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే నగరం పరిశుభ్రంగా, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, అందుకోసం కార్మికులకు వైద్య శిబిరాలు నిర్వహిస్తూ కార్పొరేషన్ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, వీధి వ్యాపారులు ఆరోగ్యం పట్ల అజాగ్రత్తగా ఉండొద్దని అన్నారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం విధిగా డ్రైడే పాటించాలని సూచించారు. దోమలు పుట్టకుండా స్థానిక పరిసరాలను శుభ్రం చేసుకోవాలని నగర ప్రజలకు మేయర్ సూచించారు.

542 మందికి వైద్య పరీక్షలు..

కేఎంసీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 542 మంది కళ్ల పరీక్షలు, గైనిక్, ఆర్థో, జనరల్ వైద్య పరీక్షలను చేయించుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, పారా మెడికల్ సిబ్బందితో కూడిన 55 మంది బృందం వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేయగా కేఎంసీ మెప్మా అధికారులు వచ్చిన వారికి అన్ని సౌకర్యాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి.కళావతి బాయి, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, మెప్మా డీఎంసీ ఎస్.సుజాత, టీఎంసీ జి.సుజాత, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చందునాయక్, ఎన్‌హెచ్‌ఎం దుర్గ, స్టాటిస్టికల్ ఆఫీసర్ జె.నవీన్‌కుమార్, మెడికల్ ఆఫీసర్లు బాలకృష్ణ, చందన, పారామెడికల్ వైద్యులు తాళ్లూరి శ్రీకాంత్, నివేద, లోహిత, రాధ, చైతన్య, అమీనా, యాస్మిన్, వై.ఆశ, రాజేష్, మెప్మా ఏఓ, సీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కు అందిస్తున్న మేయర్ నీరజ

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫార్సులతో మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. 30వ, 33వ, 34వ, 36వ, 35వ, 47వ డివిజన్లలో లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. నాయకులు యర్రం బాలగంగాధర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ మహాసభలకు ఏర్పాట్లు పూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లా కేంద్రంగా రెండు రోజుల పాటు జరగనున్న ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కల్యాణం వెంకటేశ్వరరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గడ్డం లింగమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మంలోని రామయ్య స్మారక భవనంలో రీజియన్ అధ్యక్షుడు గుండు మాధవరావు అధ్యక్షతన నిర్వహించిన మహాసభల ఆహ్వాన సంఘం కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు ఖమ్మంలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మిక సమస్యల పరిష్కారమే అజెండాగా ఏకతాటిపై నిలిచి ఒకే జేఏసీగా ఏర్పడాలన్న ఆర్టీసీ కార్మికుల ఆకాంక్షలు ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలు వేదిక కానుందన్నారు. మహాసభల ప్రారంభ సూచికంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు, అఖిలభారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తమిళనాడు రాష్ట్ర రవాణా రంగం నాయకుడు, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ కార్యదర్శి అర్ముగనయనార్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పిట్టల సుధాకర్, రీజినల్ కమిటీ ఉపాధ్యక్షుడువి.సురేష్, ప్రచార కార్యదర్శి తోకల బాబు, ఖమ్మం డిపో కమిటీ నాయకులు వి.సురేష్,ఎం.బాబు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు 'డబుల్' ఇళ్ల పట్టాల పంపిణీ

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు శుక్రవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడతలో నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేస్తున్నారని, ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మాజీ సర్పంచ్‌లు దండా పుల్లయ్య, యర్రబోయిన నర్సయ్య, భద్రయ్య, చిట్యాల రమేష్, పృథ్వి, డి.రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, నేలకొండపల్లి పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు మాజీ సర్పంచ్‌లు రాయపూడి నవీన్, వంగవీటి నాగేశ్వరరావు, వెంకన్న, బొందయ్య, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్న కేంద్రం


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో మోదీ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్ర పన్నుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ప్రారంభమైన రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. మత ఘర్షణలు జరగకుండా సీపీఎం వర్గ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. అమెరికా అహంకారాన్ని అడ్డుకునేది కేవలం సోషలిస్టు దేశాలు మాత్రమే అని అన్నారు. రాజకీయ శిక్షణ తరగతులకు ఎస్‌కె.మీరా ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా, తరగతుల ప్రారంభానికి ముందు పార్టీ సీనియర్ నాయకులు బండారు యాకయ్య జెండా ఆవిష్కరించారు.పార్టీ డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బోడపట్ల రవీందర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు, జిల్లా నాయకులు ఎంఎ జబ్బార్, దొంగల తిరుపతిరావు, బండారు రమేష్, భూక్యవవాసరావు, నాగులుమీరా, బోడపట్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ బాక్స్ చోరీ

నేలకొండపల్లి: వ్యవసాయ బావి వద్ద కరెంట్ బాక్స్ చోరీకి గురైంది. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన వేనేపల్లి తారయ్యకు చెందిన వ్యవసాయ బావి వద్ద ఉన్న కరెంట్ మోటార్‌కు ఉన్న బాక్స్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈమేరకు బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం హైవే దగ్గర శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. నల్లగొండ జిల్లా అనపర్తికి చెందిన నేలా సంతోష్ తన కుటుంబసభ్యులతో బైక్‌పై ఖమ్మం నుంచి బయలుదేరాడు. ఈక్రమంలో మండలంలోని గువ్వలగూడెం వద్దకు రాగానే మలుపు వద్ద హైవేపైకి ఎక్కకుండా అడ్డుపెట్టిన వాటికి ఢీకొట్టాడు. దీంతో సంతోష్‌తో పాటు తన కూతురు, కుమారికిడి గాయాలయ్యాయి. వీరిని స్థానిక ఆస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించారు.

యోగా శిక్షణ శిబిరం


యోగా సాధన చేస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంఅర్బన్/ఖమ్మంమామిళ్లగూడెం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని 9వ డివిజన్ రోటరీనగర్ పార్కులో శుక్రవారం ఉదయం బీజేపీ నాయకులు యోగా శిక్షణ శిబిరం నిర్వహించారు. కుమిలి శ్రీనివాసరావు ఆధ్వర్యాన జరిగిన ఈ శిబిరానికి యోగా మాస్టర్ మరికంటి వెంకట్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రముఖ డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, మండల ప్రధాన కార్యదర్శి అంజన్న, సీతారాములు, మహిళా మోర్చా నాయకురాలు సీలిమ, దళిత మోర్చా జిల్లా నాయకులు కందుల శ్రీకృష్ణ, పలపాటి ముత్యం, రాము తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాచారం

● విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: నగరంలోని ఖానాపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు(శనివారం) ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్‌శాఖ ఏడీ ఎం.యాదగిరి, ఏఈ కె.నాగేశ్వరరావులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో రోటరీనగర్, శ్రీనగర్ కాలనీ (1 నుంచి 13 వరకు), ఇందిరానగర్‌కాలనీ, గోపాలపురం, గొల్లగూడెం తదితర ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడనుందని చెప్పారు. అలాగే రఘునాథపాలెం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు శివాయిగూడెం, రఘునాథపాలెం, పువ్వాడ ఉదయనగర్, కోయచలక, దారేడు, కేటీఆర్ కాలనీ, కేసీఆర్ కాలనీ, ఇండస్ట్రీస్ ప్రాంతం, అంజలి కోల్డ్ స్టోరేజ్, వాటర్ గ్రిడ్ తదితర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని ఏడీ సంజయ్‌కుమార్ తెలిపారు.

● జయశంకర్ వర్ధంతి..

ఖమ్మంలీగల్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని జిల్లా బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ కార్యదర్శి గద్దల దిలీప్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఉదయం 5.30 గంటలకు జిల్లా కోర్టు ప్రాంగణంలో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

● అటవీ కార్యాలయంలో రక్తదాన శిబిరం

ఖమ్మంవ్యవసాయం: తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం శనివారం ఉదయం 11 గంటలకు నగరంలోని జిల్లా అటవీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని తలసేమియా వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రక్తదాతలు ముందుకొచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నివాళి..

కూసుమంచి: బహుముఖ ప్రజ్ఞాశాలి, తొలితరం సినీ గేయ రచయిత, కవి, గాయకులు చందాల కేశవదాసు 149వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నాయకన్‌గూడెంలోని కేశవదాసు స్మారకం వద్ద తహసీల్దార్ సురేష్‌కుమార్‌తో పాటు పలువురు అభిమానులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈసందర్భంగా చందాల కేశవదాసు సమకాలికులు సుబ్బారావు, కేశవదాసు కళాపీఠం అధ్యక్షుడు కొత్తా శంకర్‌రెడ్డి ఆయన జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొమిరెల్లి అలింగ గోవిందరెడ్డి, మాజీ సర్పంచ్ కంచర్ల వీరారెడ్డి, గ్రామ కార్యదర్శి దామోదర్, గడ్డం గంగయ్య, కంచర్ల లక్ష్మారెడ్డి, కొండా సతీష్, చిలకబత్తిని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మాడుతున్న మొక్కలు..



నగరంలోని వీడీవోస్ కాలనీ వెజ్అండ్‌నాన్‌వెజ్ మార్కెట్‌లో నాటిన మొక్కలకు నీరు పోసేవారు కరువయ్యారు. మార్కెట్ ఆవరణలో నాటిన మొక్కలకు పాదులు చేసినా.. నీరు పోయకపోవడంతో మాడిపోతున్నాయి. పాదులు చేసి నీరు పోయడం మరిచారా.. అని మార్కెట్‌కు వచ్చిన వినియోగదారులు చర్చించుకుంటున్నారు.

- ఖమ్మంమయూరిసెంటర్



'ప్రైవేట్' దోపిడీని అరికట్టాలి


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం/నేలకొండపల్లి: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టి, అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర జిల్లా కార్యదర్శి వంగూరి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం డీఈఓ సామినేని సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నియమ, నిబంధనలను ఉల్లంఘిస్తూ ఈ- టెక్నో, ఐఐటీ, ఒలింపియాడ్ వంటి తదితర పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా విద్యాసంస్థలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. వినతి అందించిన వారిలో నాయకులు నవీన్, నరేందర్, సంతోష్, బన్నీ, నాగ తేజ, స్టాలిన్, సందీప్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యాన ఎంఈఓకు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు యశ్వంత్, ప్రసాద్, శ్రీను, సుశాంత్, పృథ్వి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం కార్మికుల ధర్నా


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ఖమ్మంవైద్యవిభాగం: పెండింగ్ వేతనాలు చెల్లించాలని పెద్దాస్పత్రి కార్మికులు శుక్రవారం ఆస్పత్రి ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించే వరకూ విధుల్లో చేరేది లేదని స్పష్టం చేస్తూ ఆస్పత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. పెద్దాస్పత్రిలో పనిచేస్తున్న 259 కాంట్రాక్ట్ కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ గత రెండు రోజుల నుంచి శాంతియుతంగా విధులు బహిష్కరించి కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జె.ఉపేందర్ మాట్లాడుతూ.. కార్మికులు విధులు బహిష్కరించడం వల్ల రోగులందరూ తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకుని కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాలు నాయకులు రమణ అంబేద్కర్, విజయమ్మ, జగదీష్, సమత, అశోక్, శ్రీను, వెంకటరమణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దాతల ఔదార్యం

➽ పేద విద్యార్థులకు చేయూత


బ్యాగ్‌లు, నోట్‌బుక్స్ అందుకున్న విద్యార్థులతో ఇమామ్ తదితరులు

తిరుమలాయపాలెం: పేద విద్యార్థుల భవిష్యత్ కోసం హాజీ సయ్యద్ మదర్ సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేయూతనిస్తామని చైర్మన్ సయ్యద్ ఇమామ్ తెలిపారు. మండలంలోని పాతర్లపాడు, గోల్‌తండా, గోపాయిగూడెం, జింకలగూడెం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం ఆయన నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు, పెన్నులు అందజేశారు. అలాగే, షూస్, వాటర్ ప్యూరిఫైయర్లు కూడా ఇస్తామని తెలిపారు. అంతేకాక పదో తరగతిలో మండలస్థాయిలో మొదటి మూడు ర్యాంకులు సాధించే విద్యార్థులకు వరుసగా రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందిస్తామని ప్రకటించారు. కాగా, ఇమామ్‌ను ఎంఈఓ శ్రీనివాసరావు అభినందించగా హెచ్‌ఎంలు దారా రాజేష్, డి.వెంకటేశ్వర్లు మార్కెట్ డైరెక్టర్ జడల నగేష్‌తో పాటు జె.రమేష్, సయ్యద్ సైదా, షేక్ చాంద్, వీరారెడ్డి పాల్గొన్నారు.

➽ వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలు


నోట్ పుస్తకాలు అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యాన శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. త్రీటౌన్‌లో 300 మందికి షుగర్ పరీక్షలు, చెప్పులు కుట్టే వీధి వ్యాపారులకు గొడుగులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, మండల రెవెన్యూ కార్యాలయంలో సిమెంట్ బల్లలు అందించడం వంటి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. క్లబ్ గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో క్లబ్ నగర అధ్యక్షుడు, 36వ డివిజన్ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ రావు, ప్రతినిధులు వంగిరి వెంకట, గురుమూర్తి, కూరా శ్రీనివాస్, కొత్తూరు రమేష్, బూరెల పల్లారావు, కడవెండి శ్రీనివాస్, వెచ్చా కృష్ణమోహన్, పసుమర్తి శ్రీనివాసరావు, గుంటుపల్లి దివాకర్ గుప్తా, వాసవి, గుడిపాటి సరిత, ఉమారాణి, వీణ, తదితరులు పాల్గొన్నారు.

➽ నోట్ పుస్తకాలు, నిత్యావసరాల పంపిణీ


నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్, ఖమ్మం రీజియన్ ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మం జెడ్పీసెంటర్‌లోని కేఎస్‌ఎం పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి భరోసా కేంద్రంలో నిత్యావసరాల కిట్లు పంపిణీ చేశారు. అలాగే, ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం ఏర్పాటు చేశారు. యూనియన్ నాయకుడు తారక్‌నాథ్ స్మరణలో సత్యసాయి ట్రస్టు సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. బ్యాంకు రీజినల్ మేనేజర్ రాజశేఖర్, ఏజీఎం సత్యంనాయుడు, స్టాఫ్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ నందన్, రీజినల్ సెక్రటరీ చిన్నపరెడ్డితో పాటు షేక్ ఇబ్రహీం, తిప్పేస్వామి, ప్రసాద్, ఆశ, జ్యోతి, స్వాతి, రేణు, చైతన్య, రాంబాబు, కృష్ణవేణి, సంతోష్, నరేష్, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వసతి.. అనుభూతి

విద్యార్థులు హాస్టళ్లలో చేరేలా విద్యాసంస్థల ప్రచారం

- అన్ని వసతులంటూ క్యాంపెయిన్
- ఇంట్లో ఉన్న అనుభూతి కల్పిస్తామని హామీ ఇస్తున్న వైనం
- సవాలక్ష సందేహాలతో తల్లిదండ్రులు


చెరువుమాదారం ఎస్సీ బాలుర వసతి గృహం

నేలకొండపల్లి: ఈ ఏడాది 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభమైనందున విద్యార్థులు పాఠశాలలు, కళాశాలల బాట పట్టారు. ఓవైపు ప్రైవేట్ విద్యా సంస్థలు వారి సిబ్బందితో క్యాంపెయిన్ చేయిస్తూ రకరకాల విద్యా వసతులంటూ హాస్టళ్ల వైపు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకరు తమ సంస్థలో విద్య బాగుందంటే.. ఇంకొకరు ఫీజు తక్కువ, హాస్టల్ బావుందంటూ ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఇక ప్రభుత్వ వసతి గృహాల్లో అనేక వసతులు కల్పిస్తున్నందున వసతి గృహాల అధికారులు కూడా కరపత్రాలు ముద్రించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ దశలో ఎందులో చేరాలో తెలియక సవాలక్ష సందేహాలతో తల్లిదండ్రులు, విద్యార్థులు సతమతమవుతున్నారు.

ఒంటరితనాన్ని జయించేలా..

తొలిసారి హాస్టళ్లలో చేరే విద్యార్థులను ఒంటరితనం వేధిస్తుంటుంది. తరగతి గదిలో బోధన, హాస్టల్‌లో భోజనం, బాత్‌రూమ్, వసతి గదుల శుభ్రత సరిగ్గా లేకున్నా అనారోగ్యంతో, మానసికంగా కుంగిపోతున్నారు. ఈనేపథ్యాన వసతి గృహం ఓ విజ్ఞాన వనంలా మారాలంటే ఏ చిన్న సందేహాన్నైనా పెద్దల దృష్టికి తీసుకెళ్లినప్పుడే అది సాధ్యమవుతుందని, అందుకు కొన్ని జాగ్రత్తలు పాటించాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

- ➡ విద్యార్థులు తమకు ఎదురైన చేదు అనుభవాలను వసతి గృహాల అధికారులకు లేదా తల్లిదండ్రులకు తెలియజేయాలి. మనసుకు నచ్చేలా పరిష్కార మార్గం చూపాలని కోరాలి.
- ➡ మంచి స్నేహితులను ఏర్పరుచుకొని వారితో సమస్యను చర్చించుకోవాలి. అవసరమైతే సలహాలు తీసుకోవాలి.
- ➡ ఇంటిపై ధ్యాస రాకుండా అవసరమైన సబ్జెక్ట్ గురువులను అందుబాటులో ఉంచి వారితో విద్యాపరమైన అంశాలు నిత్యం చర్చించేలా చూసుకోవాలి.
- ➡ అప్పుడప్పుడు విద్యార్థులను ఆకర్షించేలా ఆయా విద్యాసంస్థలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి.
- ➡ తోటి విద్యార్థుల వల్ల సమస్య ఏర్పడితే వెంటనే పెద్దలకు చెప్పుకునేలా ధైర్యం కల్పించాలి.
- ➡ నలుగురితో కలివిడిగా ఉండేలా శిక్షణ ఇవ్వాలి.